క్లుప్తంగా

ఘనంగా మల్లమ్మ తల్లి జాతర



థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడవవలస గ్రామంలో మల్లమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అడవవలస గ్రామంలోని కొండపై వెలసిన మల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి మొక్కులు సమర్పించారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

30న ఏకలవ్య పాఠశాలలో ప్రవేశపరీక్ష

చింతపల్లి: ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఓ అన్నామణి తెలిపారు. పాఠశాలలో 6వ తరగతికి సంబంధించి 60 సీట్లకు గాను 30 బాలికలు, 30 బాలురుకు కేటాయించినట్టు పేర్కొన్నారు. 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా పరీక్షలు నిర్వహిస్తామని, ఏపీఆర్ కళాశాల, వైటీసీలో పరీక్షలు జరుగుతాయని ఆమె తెలిపారు.

మృతుల వివరాలను తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

చింతపల్లి: మండల కేంద్రంలో బూత్‌లెవల్ అధికారులు, వివిధ రాజకీయపార్టీల నాయకులతో తహసీల్దార్ ప్రసాద్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి వివరాలు తొలగించేందుకు గరుడ యాప్‌లో డీలిట్ చేయాలని సూచించారు. 2024లో జరిగే ఎన్నికల నేపథ్యంలో పీవీటీజీ ఓటర్ల జాబితా సిద్ధం చేయడంతో పాటు ఫారం-6, 6బి, ఫారం8, 8సీ డేటా పూర్తిగా సేకరించి సిద్ధం చేయాలన్నారు. రాజకీయ నాయకుల అభ్యంతరాలు తెలపాలని పోలింగ్‌బూత్‌ల మార్పులు చేర్పులపై సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు. ఎంపీడీవో లాలం సీతయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా సంతషెడ్లు



అసంపూర్తిగా ఉన్న సంతషెడ్లు

అనంతగిరి: మండలంలోని డముకు వారపు సంతల్లో సంతషెడ్లు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోని పంచాయతీ నిధులతో సంత షెడ్లు నిర్మాణం చేపట్టారు. గోడలు నిర్మించి, రేకులు ఏర్పాటుచేయకుండా వదిలేశారు. ఎండలో వ్యాపారాలు సాగిస్తుమని, అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు కోరుతున్నారు.

3న వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు



ఎంపీడీవో లాలం సీతయ్య

చింతపల్లి రూరల్: మండలంలో కొత్తపాలెం-2, కుడుంసారి పంచాయతీల్లో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ల పోస్టులకు వచ్చే నెల 3న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, అనంతరం నాలుగో తేదిన నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

ఏడు కోవిడ్ పాజిటివ్ కేసులు

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి పీహెచ్‌సీలో ముగ్గురు వ్యక్తులకు కోవిడ్ ర్యాపిడ్‌టెస్టులు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చిందని డాక్టర్ రవీంద్ర తెలిపారు. అలాగే రాజవొమ్మంగి పీహెచ్‌సీలో 28 మందికి టెస్టులు చేయగా, ఆరుగురికి పాజిటివ్ నిర్ధారణ అయినట్టు డాక్టర్ లిఖిత తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



అరకులోయలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



సావ్వలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కన్వీనర్లు, నాయకులు

చింతపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గోందిపాకలు పంచాయతీ పరిధిలోని బుధవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో 264 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా మేమంతా జగన్‌కే ఓటు వేస్తామని నినాదించడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలనపై ప్రధాని మోదీ కూడా ప్రశంసించారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు పాలనను మరింత చేరువ చేశారన్నారు. అన్ని వర్గాలకు పారదర్శకంగా, పార్టీలకతీతంగా పథకాలు అందజేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కోరాబు అనూషా దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, ఎంపీటీసీ సభ్యులు మోహన్‌రావు, పద్మ, మాజీ సర్పంచ్ బెన్నస్వామి, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో బుధవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, సచివాలయం కన్వీనర్ పంచడి తిరుపతి తదితరులు పలు ప్రాంతాల్లో పర్యటించి, సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని సావ్వ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో కన్వీనర్లు నర్సింగరావు, రఘునాథ్, గ్రామ వలంటీర్ బొంద్రు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో కుంబిడిసింగి పంచాయతీ గద్దరాయి, ఊర్లమెట్ట గ్రామాల్లో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు తదితరులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వై.బి.గొందూరు గ్రామంలో సర్పంచ్ కిముడు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, నుర్మతి పంచాయతీ గొప్పువీధిలో కన్వీనర్ కొర్రా సోంబాబు తదితరులు పథకాలపై అవగాహన కల్పించారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, హనుమంతరావు, మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నుర్మని మత్స్యకొండంనాయుడు, నాయకులు నరసింహమూర్తి, ప్రతాప్, వరహాలనాయుడు, రమణ, కన్వీనర్ ప్రసాద్, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని చదలవాడ, పెదశీతనపల్లి, తుమ్మల, రామన్నపాలెం సచివాలయాల పరిధిలో బుధవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు పర్యటించి సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించి, బ్రోచర్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, అమ్మాజీ, కోవ్వాసి రామారావు, కుంచా తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు నరేష్, నాయకులు నాగరాజు, మంగయ్య, సత్తిబాబు, లక్ష్మయ్య, నారాయణ, జోగారావు, కన్నారావు, నాగేశ్వరరావు, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరాజు, మండల సచివాలయ కన్వీనర్ మురళీకృష్ణ గృహసారథులు, కన్వినర్లు, , కో-ఆప్షన్‌మెంబర్ కామేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ అందజేస్తున్న ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



రామన్నపాలెంలో స్థానికులకు బ్రోచర్లు అందజేస్తున్న నాయకులు



ఉర్లాకులపాడులో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

4 నుంచి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి శివారున వేంచేసిన ఊడలమర్రి రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ సప్తమ వార్షికోత్సవాలు మే 4 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆరోజు ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, 8 గంటలకు హోమం,10 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనం, 11 గంటలకు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 5 న బుద్ధపౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో హోమం నిర్వహిస్తామన్నారు. 6 న వేకువజామునే అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన, కలశ పూజ, 9 గంటలకు గణపతి హోమం , 12కు సామూహిక శాంతి కల్యాణం జరుపుతున్నట్టు తెలిపారు. 7 న ఉదయం 7 గంటలకు అమ్మవారి హోమం, 2 గంటలకు రేణుకా ఎల్లమ్మ దక్షిణ కాశీ అమ్మవార్ల జాతర, ఊరేగింపు ప్రారంభిస్తామన్నారు. 8 న ఉదయం 7 గంటలకు శ్రీ ఊడలమర్రి రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మహర్షి మహా హోమం , 12 గంటలకు అన్నసమారాధన, మధ్యాహ్నం 2 గంటలకు ముత్తైదువులకు వాయినాలు సమర్పణ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా కుంబ ప్రక్రియ(బోనాలు) సమర్పణ చేయనున్నట్టు పేర్కొన్నారు.

బ్రహ్మజెముడుతో కంచె.. పంటకు రక్షణ



కునుకూరులో కంచెగా ఏర్పాటుచేసిన బ్రహ్మజెముడు

కొయ్యూరు: పశువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు వీలుగా కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. వెదురు కంపలు, ఇనుప తీగలతో కంచెలు ఏర్పాటు చేసి పంటలను సంరక్షించుకుంటున్నారు. బూదరాళ్ల పంచాయతీ కునుకూరులో ఓ రైతు తన పంటలో పశువులు రాకుండా బ్రహ్మజెముడుతో రక్షణ కంచె నిర్మించాడు. బ్రహ్మజెముడుతో చేసిన బయో కంచె ఆకట్టుకుంటుంది.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు, చిత్రంలో జెడ్పీటీసీ మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు

హుకుంపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తమ పరిధి గ్రామాల్లో సమస్యలను ప్రస్తావించారు. గ్రామాల్లో రోడ్లు, మంచినీరు తదితర సమస్యల పరిష్కారంలో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి నాయకులతో అధికారులు కలిసి సమష్టిగా పనిచేయాలన్నారు. మండల కేంద్రంలోని ఆర్బీవో కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు అధికారులు చేస్తున్న ప్రణాళికలను నిలిపివేయాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తీర్మానించినట్టు ఎంపీడీవో వెంకటరావు చెప్పారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మారేడుమిల్లి: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలోని గురుకుల ఆశ్రమ పాఠశాలలోని ఐదోవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గురుకుల పాఠశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎస్‌కే అహ్మద్ ఆలీషా బుధవారం తెలిపారు. రంపచోడవరం, అడ్డతీగల పాఠశాలలో బాలురు, రంపచోడవరం, రాజవొమ్మంగి, కూనవరంలో పాఠశాలల్లో బాలికలకు 80 సీట్లు చొప్పున ఖాళీ ఉన్నట్టు పేర్కొన్నారు. 30 తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే నెల ఏడో తేదీన విద్యార్థులు ఎంచుకున్న సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. చింతూరు, మారేడుమిల్లి పీటీజీ పాఠశాలలో మూడోవ తరగతికి ప్రవేశాలు జరుగుతున్నాయని ఆసక్తి గల విద్యార్థులు వచ్చి చేరవచ్చని తెలిపారు.

ప్రతి గ్రామంలో ఉపాధి పనులు



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ వేతనం రూ.270 తక్కువ కాకుండా వేతనం చెల్లించాలని, అదే విధంగా కొలతలు ప్రకారం పనిచేయించాలన్నారు. ఆధార్ సీడింగ్, బయోమెట్రిక్, ఎస్‌పీసీఎల్ పెండింగ్ వర్క్ మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 2023-2024 సంవత్సరానికి ఉద్యానవన రైతులను గుర్తించి 400 ఎకరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో వివిధ పనుల నిమిత్తం కేటాయించిన ఏడు రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు వేతనదారుల వివరాలతో పాటు ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్, డ్వామా పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఏపీవో మణికుమారి, టీఏలు, బీఎఫ్‌టీలు, ఎఫ్‌ఏలు, సీఓలు, జేఈలు పాల్గొన్నారు.

అందుబాటులోకి రానున్న సెల్ సేవలు



బొండగూడలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జియో టవర్

అరకులోయ రూరల్: మండలంలోని మారుమూల బస్కి పంచాయతీలో బొండగూడ, బస్కి, పడ్డిగూడ గ్రామాల్లో సెల్ టవర్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో త్వరలో ఆయా ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాలకు సెల్‌సేవలు అందుబాటులో రానున్నాయి. గిరిజనుల ఏళ్ల నాటి కల సాకారమవుతుందని పలువురు చెబుతున్నారు. గతంలో సెల్ సేవలు అందక శివారు ప్రాంత గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో సెల్ టవర్లు ఏర్పాటవుతున్నాయని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఎట్టకేలకు బస్కి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ప్రభుత్వ సహకారం, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో సెల్ సేవలు అందుబాటులో రానుండడంతో సర్పంచ్ రమేష్, వైస్ ఎంపీపీ రామన్న, గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

97 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జి.మాడుగుల: పెదబయలు మండలం గోమంగి పీహెచ్‌సీ పరిధిలో జి.మాడుగుల మండలం బొయితిలి సచివాలయంలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జరిగింది. వైద్యాధికారులు చైతన్య, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 97మంది కంటి పరీక్షలు చేశారు. ఇందులో 56 మందికి కళ్లద్దాలు అందజేశారు. బొయితిలి సచివాయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 62 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎస్ జహనీ, ఎంఎల్‌పీహెచ్ మాధవి, ఎఎన్‌ఎం దేవమణి, సత్యవతి, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థినులు

రంపచోడవరం: రంపచోడవరం ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 74శాతం ఉత్తీర్ణత సాధించారు. 167 పరీక్షలు రాయగా 123 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం 189 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 126 మంది ఉత్తీర్ణత సాధించారు. 66 శాతం సాధించారు.ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 105 మంది పరీక్షలకు హాజరు కాగా 51 మంది ఉత్తీర్ణత సాధించారు. 48.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 152 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది ఉత్తీర్ణత సాధించారు. 38.8 శాతం ఉత్తీర్ణత సాధించారు.

చింతూరు: బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాల సెకండియర్‌లో 23.8 శాతం ఉత్తీర్ణత సాధించింది. 126 మంది పరీక్షలు రాయగా 30 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ రఘురాం తెలిపారు. కళాశాలకు చెందిన చల్లా భాగ్య 843, తల్లోజు అనూష 757, వెంకట నాగదుర్గ 739 మార్కులు సాధించారు. కళాశాల ఫస్టియర్‌లో 10.15 శాతం ఉత్తీర్ణత సాధించింది. 128 మంది పరీక్షలు రాయగా 13 మంది పాసయ్యారు. ఫస్టియర్ ఫలితాల్లో స్థానిక గురుకుల కళాశాల 21.15 శాతం ఉత్తీర్ణత సాధించింది. 52 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11 మంది పాసయ్యారు.

ప్రమాదాల నియంత్రణకు కృషి



సమావేశమైన ఆటో యూనియన్ సభ్యులు

జి.మాడుగుల: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నియంత్రణకు కృషి చేయాలని మండల ఆటో యజమానుల, డ్రైవర్లు యూనియన్ అధ్యక్షుడు ఉల్లి బాబూరావు తెలిపారు. మండల కేంద్రంలోని వెంకటరాజ్ ఘాట్ వద్ద మండల ఆటో యజమానులు, డ్రైవర్లు యూనియన్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసు, ఆర్టీవో అధికారుల సూచనలు, సలహాను పాటించి ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవరించి, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. రూట్ల వారీగా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం ప్రతినిధులు, నాయకులు సంతోష్, అరుణ్, మహేష్, సాల్మన్‌రాజు, సింహాచలంపడాల్, వినోద్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. పిడుగులు పడడంతో స్థానికులు భయాందోళనలు చెందారు. ఎటువంటి నష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఏజెన్సీలో క్షయ నిర్మూలనకు కృషి



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీటీసీవో విశ్వేశ్వరనాయుడు

రంపచోడవరం: గిరిజన ప్రాంతంలో క్షయ నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు డీటీసీఓ టి విశ్వేశ్వరనాయుడు అన్నారు. రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న క్షయ పరీక్ష కేంద్రాన్ని(టీయూ) ఆయన బుధవారం సందర్శించారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ లక్షణాలతో బాధపడుతున్న వారు సమీపంలోని పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకోవాలని, వైద్యం పొందాలని సూచించారు. క్షయ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తం ఉండాలన్నారు. క్షయపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాలని,అవగాహన సదస్సుల్లో పాల్గొనాలని సిబ్బందికి సూచించారు. డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ శ్రీనివాస్, టీయూ సిబ్బంది గీతాంజలి, వంశీధర్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరతో కొనుగోలు



మాట్లాడుతున్న అప్పలనర్సయ్య

అరకులోయ రూరల్: చింతపండును గిట్టుబాటు ధరతో గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పల నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థ ప్రస్తుతం చింతపండు ధర రూ.32.40కు కొనుగోలు చేస్తోందని, గిట్టుబాటు ధర రూ.50 ప్రకటించాలని కోరారు. గిట్టుబాటు ధర లేక గిరిజన రైతులు నష్టపోతున్నారని, ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయించి మోసపోతున్నారన్నారు. ఈ ఏడాదిలో చింతపండు దిగుబడి పెరిగిందని, లక్ష్యాన్ని మించి కొనుగోలు చేయాలని కోరారు. రామరావు, బాలదేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మ, నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మెట్టబాదిపుట్టు గ్రామంలో జిల్లా స్థాయి సమ్మర్ మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ వి.రత్న, ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్.కొండమ్మ తదితరులు బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ రత్న మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గిరిజన యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వి.కొండలరావు, జయదేవ్, జగన్నాథం, మోహన్, వార్డు సభ్యులు, టోర్నమెంట్ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : కింతాడ శివారు రామచంద్రపురం గ్రామస్తులు ఆంజనేయస్వామి తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ ప్రత్యేక పూజలు జరిపారు.